క్లుప్తంగా

ఆత్మీయ కలయిక


వైఎస్సార్‌సీపీ అధినేతతో కామిరెడ్డి నాని

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ యువజన విభాగం నేతలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా అధినేతను కలిసినట్టు చెప్పారు.


వైఎస్‌జగన్‌తో నిడమర్రు జెడ్పీటీసీ సభ్యుడు కోడె కాశీ

గణపవరం: తాడేపల్లిలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల సమావేశంలో ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కోడె కాశీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రెయిన్‌ కోట్ల పంపిణీ


పంచాయతీ కార్మికులకు రెయిన్‌ కోట్లను పంపిణీ చేస్తున్న నారాయణపురం సర్పంచి

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులు రెయిన్‌ కోట్లను సర్పంచి దిడ్ల అలకానంద పంపిణీ చేశారు. వర్షాకాలం కావడంతో తరచూ తడిచి అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు రెయిన్‌ కోట్లు కొంత వరకు ఉపయోగపడతాయని సర్పంచ్‌ అలకానంద పంపిణీ చేసినట్లు తెలిపారు. దీంతో పంచాయతీ కార్మికులు సర్పంచ్‌ అలకానందకు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారికి మరమ్మతులు


తహసీల్దార్‌ కార్యాలయ రహదారికి మరమ్మతులు చేయిస్తున్న కార్యదర్శి రవి కుమార్‌

ఉంగుటూరు: ఉంగుటూరులో తహసీల్దార్‌ కార్యాలయం బురదమయంగా మారింది. దీంతో పత్రికల్లో వస్తున్న వార్తలకు స్పందించారు. తారు రబ్బీస్‌ తీసుకొచ్చి పోసి గోతులు పూడుస్తున్నారు. ఇలా మరమ్మతులు చేస్తున్నారు. దీంతో రహదారి పరిస్థితి కాస్త మెరుగుపడింది.

బాలసదనంలో వైద్య శిబిరం


చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: బాలసదనంలో వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 14 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ వ్యాయామం, సరిపడా నిద్ర, క్రమంతప్పకుండా భోజనం అనారోగ్యం సంభవిస్తే సమీప వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

కౌలు రైతుల హక్కులను సాధించుకోవాలి


కౌలు కార్డులపై అవగాహన కల్పిస్తున్న దళిత బహుజన సెంటర్‌ ప్రతినిధులు

దెందులూరు: కౌలు రైతులు తమ హక్కులను సాధించుకోవాలని దళిత బహుజన రిసోర్స్‌ సెంటర్‌ క్యాంపెయినింగ్‌ కో–ఆర్డినేటర్‌ భలే సురేష్‌ అన్నారు. మంగళవారం దళిత బహుజన సెంటర్‌ ఆధ్వర్యంలో కొవ్వలి గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు అందరికీ ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో కౌలు రుణాలు మంజూరు చేయాలని పంట సాగుదారులకు కిసాన్‌ క్రెడిట్‌ కార్డులు అందజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలైన పంట బీమా, ఇన్‌పుట్‌ సబ్సిడీ వంటివి రైతుసేవా కేంద్రాల ద్వారా అందించాలన్నారు. దళిత బహుజన్‌ రిసోర్స్‌ సెంటర్‌ సిబ్బంది గోసాల ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- ఉంగుటూరులో భారీ వర్షం
- నేలకొరిగిన విద్యుత్‌ స్తంభాలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో భారీ వర్షం కురిసింది. సోమ, మంగళవారాల్లో వర్షం పడింది. సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన 2.5 మిల్లి మీటర్ల వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. సార్వా పనులు ముమ్మరంగా చేయడానికి వర్షం ఉపయోగపడతుందని రైతులు అంటున్నారు. త్వరితగతిన వ్యవసాయ పనులు ఇప్పటికే మొదలు పెట్టారు. సాగునీరు ఇబ్బంది లేకుండా వర్షం ఉపయోగపడనుంది. ఇదిలా ఉండగా ఈదురు గాలులకు చాలా చోట్ల చెట్లు పడిపోయాయి. యర్రమళ్ల సబ్‌స్టేషన్‌ వద్ద విద్యుత్‌ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో తాడేపల్లి సబ్‌స్టేషన్‌ నుంచి వచ్చే విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఏఈ శ్రీరామ్‌ ఆధ్వర్యంలో విద్యుత్‌ పునరుద్ధరణ పనులు చేశారు. ఈదురు గాలులతో మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఉంగుటూరులో సోమవారం అర్ధ రాత్రి 12 గంటల నుంచి విద్యుత్‌ నిలిచిపోయింది. మంగళవారం ఉదయం 9 గంటలకు గాని రాలేదు. ఇలా పలు గ్రామాల్లో విద్యుత్‌ సమస్య ఉత్పన్నమైంది.


పంట బోదె పొంగి గ్రామంలో ప్రవహిస్తున్న నీరు

పంట బోదె ఊరి మీదకు

పంటబోదె ఉంగుటూరు నంబర్‌–1 తూము వద్ద నుంచి పొంగి ప్రవహిస్తోంది. గాజుల వారి వీధిలో గట్ల మీద నుంచి రోడ్డు మీదకు ప్రవహిస్తోంది. కురిసిన వర్షాలకు రోడ్డు మీద నీరు ప్రవహించింది. నంబర్‌–1 తూము వద్ద నుంచి గ్రామం మధ్య నుంచి రెండు బోదెలు ప్రవహించి ఊరి బయట ఉన్న పంట చేలకు నీరు చేరుతుంది. అలాంటిది గట్లు సరిగా లేకపోవడం, తూము నియంత్రించే పరిస్థితి లేకపోవడంతో నీరు రోడ్డు మీదకు చేరింది. దీంతో ఆ పేటలోకి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


యర్రమళ్ల సబ్‌స్టేషన్‌ వద్ద నేలకొరిగిన విద్యుత్‌ స్తంభాలు


ఈదురు గాలులకు విద్యుత్‌ వైర్లపై పడిన చెట్లు

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

దెందులూరు: రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు సలహాలు పరిగణలోకి తీసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్‌ డైరెక్టర్‌ హబీబ్‌ బాషా అన్నారు. మంగళవారం దెందులూరులో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పెరుగ్గూడెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్‌ డైరెక్టర్‌ హబీబ్‌ బాషా మాట్లాడుతూ భూ సాంద్రత ఆధారంగా రైతులు సాగు చేయాలన్నారు. హార్టికల్చర్‌ సహాయ సంచాలకులు కె.సంతోష్‌, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిల్‌ కుమారీ, రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ హబీబ్‌ బాషా

ఉచిత ట్యూషన్‌ను సద్వినియోగం చేసుకోండి

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌ రాజా ఆధ్వర్యంలో ఆర్‌సీఎం పాఠశాల విద్యార్థులు 50 మందికి ఉచిత ట్యూషన్‌ సౌకర్యం కల్పిస్తున్నామని ఆర్‌సీఎం చర్చి సహాయక గురువు ఫాదర్‌ కళ్యాణ్‌ అన్నారు. మంగళవారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో సెయింట్‌ మేరీస్‌ యూపీ ఇంగ్లిష్‌ మీడియం పాఠశాల హెచ్‌ఎం సిస్టర్‌ టీనా ఫాదర్‌ కళ్యాణ్‌ విద్యార్థులు వారి తల్లి దండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌ అమ్మన్‌ రాజా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ లక్ష్యంగా వలంటీర్లను ఏర్పాటు చేసి, ఉచితంగా ట్యూషన్‌ చెప్పిస్తున్నామన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.


ట్యూషన్‌కు వచ్చిన విద్యార్థులు

వైభవంగా ఆంజనేయస్వామి ఊరేగింపు

ద్వారకాతిరుమల: హనుమద్‌ జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక తూర్పు వీధిలో కొలువైన ఆంజనేయ స్వామివార్ని మంగళవారం సాయంత్రం క్షేత్ర వీధుల్లో ఊరేగించారు. ఏటా వలె నాయీ బ్రాహ్మణులు ఈ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని అశ్వరథ వాహనంలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అట్టహాసంగా ఊరేగించారు. భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ప్రసాదాలను స్వీకరించారు. తిరిగి స్వామివారు రాత్రికి ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


క్షేత్ర వీధుల్లో ఊరేగుతున్న ఆంజనేయస్వామి రథం

హాస్టల్‌ విద్యార్థులకు రగ్గుల పంపిణీ


విద్యార్థులకు రగ్గులు అందజేసిన లయన్స్‌ సభ్యులు

గణపవరం: గణపవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో చదువుకుంటున్న 40 మంది విద్యార్థులకు గణపవరం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లంకి నరేష్‌, కిలారి రవిబాబు, మాజీ అధ్యక్షుడు కె.సత్యనారాయణమూర్తి, పోశింశెట్టి రామ్మూర్తి, కె.విశారద పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నారాయణపురం, చేబ్రోలు, ఉంగుటూరు, కైకరం గ్రామాల్లో ఎంపీడీవో రాజ్‌మనోజ పర్యవేక్షించారు. ఉదయం నుంచి పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో ఉద్యోగులు వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. కొన్ని చోట్ల ఆలస్యమైంది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పింఛన్ల పంపిణీ మేలని వలంటీర్లు తెల్లవారు జాము నుంచే ఇంటింటికీ వచ్చి ఇచ్చేవారని పలువురు వృద్ధులు వ్యాఖ్యానించారు.

పేకాట స్థావరంపై దాడి

ఉంగుటూరు: మండలంలోని పెద వెల్లమిల్లి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.35,860 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సూర్య భగవాన్‌ తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టుకొని కేసు నమోదు చేసి, మంగళవారం కోర్టుకు హాజరుపరిచామని ఆయన తెలిపారు.

పచ్చిరొట్ట సాగుతో అదనపు ఆదాయం

చింతలపూడి : పచ్చిరొట్ట సాగుతో పచ్చదనంతో పాటు రైతులకు అదనపు ఆదాయం, భూమికి జీవం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల డిజిటల్‌ ఫెసిలిడేటర్‌ మరికంటి గోపాలకృష్ణ తెలిపారు. చింతలపూడి మండలంల ఎండపల్లి గ్రామంలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నవధాన్యాల పచ్చిరొట్ట సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. మండలంలో పచ్చిరొట్ట, నవధాన్యాల సాగు విజయవంతంగా జరుగుతున్నట్టు గోపాలకృష్ణ చెప్పారు. 45 రోజుల నవధాన్యాల పంట కోత ప్రయోగాన్ని మంగళవారం నిర్వహించారు. ఎకరాకు 18 కిలోల విత్తనాలు చల్లితే దాదాపు 22 టన్నుల పచ్చిరొట్ట పశుగ్రాసం దిగుబడి వస్తుందన్నారు. ఈ పచ్చిరొట్ట పశువులకు పోషకమైన మేతగానే కాకుండా, భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్‌ వంటి ముఖ్యమైన మూలకాలను అందిస్తుందని వివరించారు. ఎకరా సాగు ద్వారా మొత్తం 60 కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్‌ భూమిలోకి చేరుతుందని చెప్పారు. రసాయన ఎరువులతో సమానమైన శక్తి భూమికి అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు. రైతులు ఈ విధానం ద్వారా భూములను సారవంతం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో యూనిట్‌ ఇన్‌చార్జి నరసింహ, ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.


పచ్చిరొట్ట పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

జాతీయ లోక్‌అదాలత్‌పై విస్తృత ప్రచారం

చింతలపూడి : పెండింగ్‌ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌ అదాలత్‌లను వినియోగించుకోవాలని జూనియర్‌ సివిల్‌ జడ్జి సి.మధుబాబు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 5న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్‌, సివిల్‌, బ్యాంక్‌ రికవరీ, చెక్‌ బౌన్స్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్‌ కేసులను పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. లోక్‌ అదాలత్‌ విశిష్టత గురించి విస్తృత ప్రచారం చేయాలని న్యాయవాదులను, అధికారులను కోరారు. ప్రతి రోజు కోర్టులో ప్రీ సిట్టింగ్స్‌ ద్వారా కేసులను రాజీ చేస్తున్నట్టు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యుల సేవలు వెల కట్టలేనివి

ఘనంగా డాక్టర్స్‌ డే వేడుకలు

దెందులూరు: వైద్యుల సేవలు అంకితభావంతో కూడుకున్నవని, వాటిని వెలకట్టలేమని బీఆర్‌డీ నర్సింగ్‌ కళాశాల కరస్పాండెంట్‌ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం నర్సింగ్‌ కళాశాలలో నేషనల్‌ డాక్టర్స్‌ డే వేడుకలు నిర్వహించారు. డాక్టర్‌ బిధాన్‌ చంద్రరాయ్‌ జయంతిని భారత ప్రభుత్వం నేషనల్‌ డాక్టర్స్‌ డేగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన సేవలు వైద్య వృత్తి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా వేడుకలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. వైద్యుడిగా సేవలు అందిస్తూనే ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌, మెడికల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా వంటి సంస్థలకు విశేష కృషి చేశారన్నారు. తొలుత ఆయన చిత్ర పటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.


దెందులూరు: డాక్టర్స్‌ డే వేడుకల్లో పాల్గొన్న నర్సింగ్‌ కళాశాల విద్యార్థులు

పలువురు వైద్యులకు సత్కారం

గణపవరం: రాత్రి, పగలు తేడా లేకుండా, విసుగూ విరామం లేకుండా వృత్తినే దైవంగా భావిస్తూ, ప్రాణదానం చేస్తున్న వైద్యులు ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం డాక్టర్స్‌డే సందర్భంగా గణపవరం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో గణపవరం, నిడమర్రు మండలాల్లోని పలువురు వైద్యులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. గణపవరం పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్‌ ఓంకార్‌నాథ్‌ను సత్కరించారు. అదే విధంగా గణపవరం ఏరియా పీఎంపీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో డాక్టర్స్‌ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్‌ జోన్‌ చైర్మన్‌ వెల్లంకి నరేష్‌ మాట్లాడుతూ కరోనా వంటి భయంకర సమయంలోనూ తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడిన వైద్యుల సేవలు అజరామరమన్నారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్‌ మండల అధ్యక్షుడు కె.సత్యనారాయణ మూర్తి, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, సభ్యులు అప్పారావు, మస్తాన్‌వలి, పానకాలు, జి.శ్రీను, కిషోర్‌, లయన్స్‌ సభ్యులు కిలారి రవిబాబు, పోశింశెట్టి రామ్మూర్తి, కె.విశారద, కేఎస్‌ ప్రకాష్‌, తదితరులు పాల్గొన్నారు.


గణపవరం: పీహెచ్‌సీ వైద్యుడిని సత్కరిస్తున్న లయన్స్‌ సభ్యులు

పీఎంపీలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

పీఎంపీ అసోసియేషన్‌ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని గణపవరం సీఐ నక్కా రజనీకుమార్‌ అన్నారు. మంగళవారం డాక్టర్స్‌డే సందర్భంగా గణపవరం ఏరియా పీఎంపీ అసోసియన్‌ సభ్యులు గణపవరం నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన రజనీకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పెండింగ్‌ వేతనాలు విడుదల చేయాలి

ఉంగుటూరు: పంచాయతీ ఉద్యోగులకు పెండింగ్‌ వేతనాలు వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్‌ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు కూడా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు. 16వ ఫైనాన్స్‌ కమిషన్‌ విడుదల చేసిన 1150 కోట్లు స్థానిక సంస్థలకు అందజేయాలన్నారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకం అవినీతిమయం అయిందని విమర్శించారు. తల్లికి వందనం పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. పంచాయతీ రాజ్‌ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీకి రిటైర్డ్‌ టీచర్‌ ఆర్థిక సాయం

దెందులూరు: తాను టీచరుగా పని చేసిన గ్రామానికి రిటైర్డ్‌ హిందీ టీచర్‌ పీవీ కోటేశ్వరరావు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఆ సొమ్మును గ్రామ సచివాలయ సిబ్బందికి మాజీ సర్పంచ్‌ సింహాద్రి శ్రీమన్నారాయణ సమక్షంలో అందజేశారు. మండలంలోని చల్లచింతలపూడి గ్రామంలో తాను టీచర్‌గా పని చేశానని, ఆ గ్రామానికి ఎంతో కొంత ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో పంచాయతీ అభివృద్ధి కోసం తనవంతు సాయం అందించానని ఈ సందర్భంగా కోటేశ్వరరావు చెప్పారు. దీనిపై వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత, చల్లచింతలపూడి మాజీ సర్పంచ్‌ సింహాద్రి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కోటేశ్వరరావు సేవానిరతిని కొనియాడారు. గ్రామాభివృద్ధికి ఆర్థిక సాయం అందించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు.


పంచాయతీకి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

నూతన కార్యవర్గం ఎన్నిక

గణపవరం: గణపవరం ఏరియా కిరాణా మర్చంట్స్‌ అసోసియేషన్‌ సర్వసభ్య సమావేశం గణపవరం వైఎస్సార్‌ ఇందిరమ్మ కాలనీలోని శ్రీకృష్ణ ఆలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కమిటీ అధ్యక్షుడిగా బైరబోయిన మాల్యాద్రి యాదవ్‌, కార్యదర్శిగా శేగు సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా జువ్వల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా కొల్లూరి బాల, పెనగంటి రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రధాన రహదారులు అధ్వానం


జంగారెడ్డిగూడెం పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు


జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డు గుంతలమయంగా ఉన్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్డు, శ్రీనివాసపురం రోడ్డు, అశ్వారావుపేటరోడ్డు, ఏలూరు రోడ్డు ఇలా.. ప్రతి రోడ్డూ గోతులతో దర్శనమిస్తున్నాయి. సాధారణ రోజుల్లో వాహనచోదకులు గోతులను తప్పించుకుంటూ రాకపోకలు సాగించే వారు. ప్రస్తుత వర్షాల కు గోతుల్లో నీరు చేరి, ఏ గొయ్యి మేరకు ఉందో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల రోడ్లు ఛిద్రంగా మారుతున్నా యి. జంగారెడ్డిగూడెం పట్టణంలో వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం వాహన రాకపోకలు జరుగుతునే ఉంటాయి. పాఠశాలలు, కళాశాలలు ఎక్కువగా ఉండటంతో నిత్యం పదుల సంఖ్యలో బస్సులు ప్రయాణిస్తుంటాయి.

కానరాని శాశ్వత చర్యలు

మరమ్మతులు చేస్తున్నప్పటికీ శాశ్వత ప్రాతిపదికన చర్యలు లేకపోవడంతో కొద్ది రోజులకే రోడ్లు యథాస్థితికి చేరుతున్నాయి. దీంతో ప్రజా ధనం నీటిపాలవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్డు పొట్టి శ్రీరాముల విగ్రహం నాలుగు రోడ్ల కూడలి వద్ద భారీ గోతులు ఏర్పడటంతో ట్రాఫిక్‌ జామ్‌ అవుతుంది. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అశ్వారావుపేట రోడ్డులోని టౌన్‌హాల్‌ సమీపంలో రోడ్డు మరింత ఛిద్రమైంది. ఏలూరు రోడ్డు గోతులతో నిండి ఉంది. ఇక శ్రీనివాసపురం వెళ్లే రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.